## రామాయంపేట పిఏసిఎస్ పాలకవర్గం పదవీకాలం పొడిగింపు

**సహకార శాఖ ఉత్తర్వులు జారీ, బాధ్యతలు స్వీకరించిన ఛైర్మన్, డైరెక్టర్లు**

**రామాయంపేట, నవంబరు 19, ప్రభాతవార్త :** రామాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పాలకవర్గం పదవీకాలాన్ని పొడిగిస్తూ జిల్లా సహకార శాఖ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా అధికారులు ఆర్డర్‌లో తెలిపారు. గతంలో కొన్ని కారణాల వల్ల రామాయంపేట పీఏసీఎస్ పాలకవర్గం పదవీకాలం పొడిగింపును ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఛైర్మన్ బాదే చంద్రంతోపాటు, పాలకవర్గ డైరెక్టర్లు బక్కన్నగారి సులోచన, సుధాకర్ రెడ్డి, రమావత్ లక్ష్మి ృ, లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి ృలు ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించారు. పీఏసీఎస్ పాలకవర్గ కాలపరిమితిని పొడిగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో, ఆ ఆదేశాల మేరకు పాలకవర్గం కాలపరిమితిని పొడిగిస్తూ జిల్లా సహకార శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లా సహకార శాఖ ఆదేశాల అనంతరం బుధవారం ఛైర్మన్ బాదే చంద్రం, డైరెక్టర్లు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. అయితే కోర్టుకు వెళ్ళని ఇద్దరు డైరెక్టర్ల కాలపరిమితిని మాత్రం జిల్లా సహకార శాఖ పొడిగించకపోవడం గమనించదగ్గ విషయం.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## డిప్యూటీ ట్రైనీ కలెక్టర్‌కు ఘన స్వాగతం

**న్యాల్‌కల్, నవంబరు 19, ప్రభాతవార్త:** మూడు వారాల పాటు మండలంలో శిక్షణ పొందేందుకు డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ ప్రతిభాశేఖర్ బుధవారం మండల కేంద్రానికి చేరుకున్నారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని రెవిన్యూ కార్యాలయానికి చేరుకున్న డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ ప్రతిభా శేఖర్‌కు తహసీల్దార్ ప్రభులు, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డిలు పూల బొకేను అందింది సాదరంగా స్వాగతం పలికారు.

**సిద్దివినాయకుడిని దర్శించుకున్న డిప్యూటీ ట్రైనీ కలెక్టర్...**

మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో రెండు శతాబ్దాల క్రితం స్వయంభూవుగా వెలిసి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీ వరసిద్ది వినాయక ఆలయాన్ని బుధవారం డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ పి ప్రతిభా శేఖర్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ప్రతిభా శేఖర్‌ను ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రతిభా శేఖర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి ప్రావీణ్య

## పత్తి కొనుగోలు సజావుగా జరగాలి

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 19, ప్రభాతవార్త:** పత్తి, ధాన్యం తదితర పంటల కొనుగోళ్లను పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాకలెక్టర్ ప్రావీణ్య సంబంధిత శాఖలతో విడివిడిగా సమీక్షలు నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 2025–26 సీజన్ పత్తి సాగు, దిగుబడిపై సమగ్ర అంచనాప్రకారం, పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు మార్కెటింగ్ యార్డుల పరిధిలోని 24 జిన్నింగ్ మిల్లుల నుండి సీసీఐ ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయనుందని తెలిపారు. పత్తి అమ్మకానికి ఆధార్ ప్రామాణికత తప్పనిసరి అని, చెల్లింపులు రైతుల ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాలలోనే జమ అవుతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లులు తనిఖీ చేసి యంత్రాలు, వసతులు, భద్రత ప్రమాణాలు సరిగా ఉన్నాయో లీగల్ మెట్రాలజీ శాఖ పర్యవేక్షణలో పరిశీలించాలని ఆదేశించారు. అగ్నిమాపకశాఖ అధికారులు మిల్లులను సందర్శించి భద్రత సూచనలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ బాల సరోజ, డిఎం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్, సహకారశాఖ అధికారి కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జహీరాబాద్ ఆర్ డి ఓ దేవుజా , నిఘా ప్రత్యేక అధికారి విశాలాక్షి , మార్కెటింగ్ శాఖ అధికారులు, సంబంధితశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా వయోవృద్ధుల వారోత్సవాలు...**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 19,(ప్రభాతవార్త:** వయోవృద్ధులు సమాజానికి జ్ఞాన బండాగారాలు అని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు,వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు 2025ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, వయోవృద్ధులు మన సమాజానికి అపారమైన జ్ఞాన భాండాగారం. వారి అనుభవాలు, మార్గదర్శకాలు భవిష్యత్ తరాల నిర్మాణానికి దిక్సూచి లాంటివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వయోవృద్ధుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## యశ్వంత్‌రెడ్డికే టేక్మాల్ ఛైర్మన్ పదవి

**హైకోర్టు ఆదేశాలతో పాత పాలకవర్గం పదవుల్లోనేకొనసాగింపు**



హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చూపుతున్న దృశ్యం

**టేక్మాల్, నవంబరు 19 (ప్రభాతవార్త):** ప్రాథమిక సహకార సంఘంలో ఉంటున్న చైర్మన్‌ను తొలగించాలన్న ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన కొందరు డైరెక్టర్లల ప్రోత్బలంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి విఫ లమైదాడులు చేసుకున్న విషయం తెల్సిందే. టేక్మాల్ ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం చైర్మన్‌గా గతంలో యశ్వంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవిని చేజిక్కించుకునేందుకు చేయని ప్రయత్నంలేదు. అవినీతి ఆరోపణలు, ఆవిశ్వాసం ఇలా ఎన్నీ ప్రయత్నాలు కాంగ్రెస్ చేసిన అన్నింటిని తట్టుకుని చెర్మన్ యశ్వంత్‌రెడ్డి ముందు నిలిచారు. కాగా సొసైటీ పాలక వర్గాల పదవి కాలం పొడగిస్తూ రెండుసార్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా టేక్మాల్ సొసైటీ ఛైర్మెన్‌ను మారుస్తూ ఇంచార్జ్ సొసైటీ అధికారి ఉత్తర్వులను జారీ చేశారు. అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అధిపత్యాన్ని చూపించుకోవడానికి సొసైటీ అధికారితో ఉత్తర్వులు జారీ చేయించుకోని చైర్మెన్‌గా నర్సింహారెడ్డిని ప్రకటించుకున్నారు. దీంతో ఇద్దరు చైర్మన్లు కొనసాగిన ఎవరికి చెక్‌పవర్ ఇవ్వలేదు. అవినీతి ఆరోపణలు రుజువు కాక ముందే విచారణ కొనసాగుతున్న సమయంలో వేరే వారికి చైర్మన్ పదవి కట్టబెట్టారని హైకోర్టును చైర్మెన్ యశ్వంత్‌రెడ్డి ఆశ్రయించారు. డీసీవో ఇచ్చిన ఉత్తర్వులు చెల్లనేరవని ఇంతకు ముందు కొనసాగిన చైర్మెన్లె పదవుల్లోనహైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో పాత పాలక వర్గం పదవుల్లో ఉన్న పాలకవర్గమే కొనసాగుతుందని హైకోర్టు ఉత్తర్వులు జారి చేసింది. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి తాను సొసైటీ చైర్మన్‌గా కొనసాగుతానని యశ్వంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం డిసిఓ కరుణకర్ చేతుల మీదుగా హైకోర్టు ఉత్తర్వులను యశ్వంత్‌రెడ్డి అందుకున్నారు.

## రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో రెహమాన్ ప్రతిభ

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 19, ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా సెంచరీ కాలనీ, రాణి రుద్రమదేవి స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఈత పోటీలో సంగారెడ్డికి చెందిన శ్లోకాస్ శ్రీవాణి హైస్కూల్ విద్యార్థి మహమ్మద్ అబ్దుర్ రహమాన్ సిద్దిఖ్ ప్రతిభ చాటి మూడో స్థానంలో నిలిచి, రెండు రజత పతకాలు సాధించిచాడు. సంగారెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసరావు. డివైఎస్ఓ కాసింబేగ్ సంతోషం వ్యక్తం చేస్తూ మహమ్మద్ అబ్దుర్ రెహమాన్‌ను అభినందించారు.



రాష్ట్ర స్థాయి లో ప్రతిభ చాటిన రెహమాన్

# పారదర్శకంగా ఇందిరమ్మ చీరెల పంపిణీకి కృషి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ జిల్లాలో పారదర్శకంగా జరిగేలా కృషి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులకు సూచించారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో చీరల పంపిణీని ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తామని సిఎంకు కలెక్టర్ వివరించారు. అనంతరం మహిళా సమైక్య సభ్యులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మహిళల ఉన్నతి–తెలంగాణ ప్రగతి కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి విమర్శలు, పొరపాట్లకు తావు లేకుండా అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ అయ్యేలా కృషిచేయాలన్నారు. చీరల పంపిణి కార్యక్రమం పర్యవేక్షణ కోసం నియోజకవర్గానికి ఒకరూ చొప్పున ప్రత్యేక అధికారిని నియమించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధుల సమక్షంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి నిర్ణీత గడువు లోగా చీరల పంపిణీ పూర్తిచేయాలని చెప్పారు.చీరల పంపిణీ కోసం ప్రతి గ్రామంలో 18 ఏళ్లు నిండిన యువతులు, మహిళల వివరాలను సేకరించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, డిఆర్‌డిఏ పిడి జయదేవ్‌ఆర్య, డిపివో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, మహిళా సమైక్య ప్రతినిధులు, ఎపివోలు పాల్గొన్నారు.

**ఘనంగా అంతర్జాయ వయో వృద్దుల దినోత్సవం**

జిల్లా కేంద్రంలోని టిటిసి భవన్‌లో బుధవారం అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల ముగింపు, అంతర్జాతీయ వయోవృద్దుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభచూపిన వయోవృద్దులు 12 మందిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ హైమావతి ఘనంగా సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ హైమావతి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిడబ్ల్యుఓ సి.హెచ్.శారద తదితరులు పాల్గొన్నారు.

**భూ బాధితులకు అండగా ఉంటాం...**

రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ హైమావతి కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోతున్న మర్కుక్, వర్గల్, మండలాల రైతులతో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణానికి జిల్లాలో అవసరమైన భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న రైతులకు ప్రభుత్వం తరపున దక్కాల్సిన నష్టపరిహారం తర్వగా అందేలా చూస్తామని భూమిని తర్వగా అందించేందుకు రైతులు ముందుకు రావాలన్నారు.అనంతరం సంబంధిత భూమిని కోల్పోనున్న గ్రామాల రైతులు వారికి చెల్లించాల్సిన నష్టపరిహారంపై జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ చీరెల పంపిణీ పారదర్శకంగా జరగాలి

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ,నవంబర్ 19, ప్రభాతవార్త**

సంగారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, మహిళా సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, మహిళా సమాఖ్యలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకాటి శ్రీహరి, సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మహిళా సమాఖ్య ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన కలెక్టర్ ప్రావీణ్య ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి విమర్శలు, పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ అయ్యేలా సమాఖ్య ప్రతినిధులు కృషిచేయాలన్నారు. జిల్లాలో 24,904 మహిళా సంఘాలు, 2,60,692 మంది సభ్యులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఇవి సెర్ప్, మెప్మా పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, డిపిఒ సాయిబాబా, పిడి మెప్మా ఇన్‌చార్జ్, ఈడి కార్పొ రేషన్ అధికారి రామాచారి, అదనపు డిఆర్డిఒలు బాలరాజు, సూర్యారావు, జిల్లా మహిళా సమైక్య సభ్యులు, ఏపిఎంలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య

**ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య**

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, 53వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శన 2025ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల(డాక్టర్ అబ్దుల్ కలాం ప్రాంగణంలో) బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ హైమావతి, డిఈవో శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రారంభించి మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తున్నారనిన తెలిపారు.జిల్లా కలెక్టర్ కట్ట హైమావతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రీయ విజ్ఞానాన్ని, శాస్త్రీయ వైఖరిని రూపొందించుకోవాలన్నారు. పిల్లలు చిన్న వయస్సులో విషయం పట్ల అవగాహన పెంచుకోవడం సులభమని చిన్నప్పుడు ఆలోచన చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. తార్కిక ఆలోచనలు ఎక్కువ విజ్ఞానాన్ని కలగజేస్తాయన్నారు. శాస్త్రీయ విజ్ఞానంపై నిరంతం కృషి చేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. భారత రత్న ఎపిజె అబ్దుల్ కలాం రచించిన వింగ్స్ ఆఫ్ ఫైర్ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదివి ఉన్నత కలలు కని వాటి సాకారానికి నిరంతరం కృషి చేయాలన్నారు. డిఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ యేడు సైన్స్ రంగంలో జిల్లా సాధించిన ప్రగతిని వివరించారు. జిల్లా ఆర్టీఎ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ తదితరులు మాట్లాడారు.



వైజ్ఞానిక ప్రదర్శను ప్రారంభిస్తున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్, జిల్లా కలెక్టర్

జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో 183 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు, 236 బాల వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం అతిథులు విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, సెమినార్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ కళ్లెపల్లి శ్రీనివాస్, ఎంఈవోలు ప్రభుదాస్, రాజాప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కెడం లింగంమూర్తి, కౌన్సిలర్ పూర్ణిమ ఎల్లం యాదవ్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శశిధర్‌శర్మ, విజయేందర్‌రెడ్డి, ఆస లక్ష్మణ్,శేషియాదవ్, దేవరాజు, విజయ, కనకమాల, సుజాత, బాలసరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# ప్యాడి క్లీనర్ల వినియోగంతో నాణ్యమైన వరి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



రాయిలాపూర్ గ్రామ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కౌడిపల్లి, నవంబరు 19, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో వరి సేకరణ కీలక భూమిక పోషిస్తోందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్‌తో కలసి కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించి, కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్‌రాజ్ మాట్లాడుతూ రైతులకు పారదర్శకంగా, నష్టాలులేకుండా ధాన్యం కొనుగోలు చేసే విధానంపై నిర్వాహకులకు సూచనలు, సలహాలు అందించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత సంవత్సరం ఇదే నెలలో 16,060 మంది రైతుల నుంచి 90,728 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 56.12 కోట్లు చెల్లించగా, ఈ ఏడు ఇప్పటివరకు 37,117 మంది రైతుల నుంచి 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 186.40 కోట్లు చెల్లింపులు జరిగినట్లు ఆయన తెలిపారు. గతంలో కంటే మెరుగ్గా ధాన్యం కొనుగోలు జరుగుతుండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు తెచ్చిన వడ్లను ప్యాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేసి తూకం వేయడం జరుగుతోందని, ఈ విధానం వల్ల ధాన్యంలోఉన్న ధూళి, ఇతర అశుద్ధి పదార్థాలు తొలగిపోయి రైతులకు తూకం నష్టాలు గణనీయంగా తగ్గుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 37,117 మంది రైతుల నుంచి మొత్తం 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపినట్లు ధాన్యం రుసుములు రైతుల బ్యాంక్ ఖాతల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్యాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేయడం వల్ల రైతులకు ప్రతీ క్వింటాలుపై 1 కిలో 500 గ్రాముల వరకు ఆదా ఆవుతుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రైతులకు ఈ విధానం అత్యంత ప్రయోజనకరమని పేర్కొని, ప్రతి రైతు తప్పనిసరిగా(ప్యాడి క్లీనర్ వినియోగం) చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రమైన ధాన్యం అందుబాటు ప్రయోజనాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తోపాటు తహశీల్దార్ క్రిష్ణ, మహమ్మద్ నగర్ సొసైటీ సీఈవో దుర్గాగౌడ్, సంబంధిత అధికారులు, రైతులు తదితరలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

## ప్రజాసమస్యలను పరిష్కరించాలి : ఎమ్మెల్యే

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబర్ 19, ప్రభాతవార్త:**

సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురిలను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య దృష్టికి పలు ప్రధాన అంశాలను తీసుకొచ్చారు. ప్రజా వ్యవస్థలో తక్షణ చర్యలు అవసరమైన అంశాలను వివరించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, రహదారుల మరమ్మ తులు, పెండింగ్ పనులు, రైతులకు సమస్యల పరిష్కారం వంటి విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు ఫసల్వాది, కంది, ఇంద్రకరణ్, ఆరుట్ల, గ్రామాలలో ల్యాండ్ పూలింగ్ లో భూములు కోల్పోయిన రైతులకు, రైతు బీమా, రైతు భరోసా రావడం లేదని వారికి సంబంధించిన తగు చర్యలు తీసుకోవాలని కోరారు సింగూర్ ప్రాజెక్టు మరమ్మతుల దృశ్య ప్రజలకు తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని కోరారు. సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ యార్డుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లు రైతులు ఉన్నారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రంలో అగ్ని ప్రమాదం

**జహీరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త:** పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రంలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కేంద్రంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు గుర్తించిన సిబ్బంది వెంటనే ఫైర్ సర్వీస్ స్టేషన్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. సంఘటన స్థలాన్ని విద్యుత్ శాఖ డిఈ లక్ష్మినారాయణ, ఏ.నాగరాజ్, ఎస్ఐ వినయ్‌కుమార్ సందర్శించారు.

**అంతారం జాతరలో అపశృతి..**

## గుండంలో మునిగి వ్యక్తి మృతి

**మునిపల్లి, నవంబరు 19 (ప్రభాతవార్త):** మునిపల్లి మండలం అంతారం జాతరలో అపస్మృతి నెలకొంది. మందిరం సమీపంలోని గుండంలో మునిగి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే... అంతారంలో 5 రోజులుగా జీవన్ముక్త పాండురంగడి ఉత్సవాలు జరుగుతున్నాయి. జహీరాబాద్ మండలం ఖాసింపూర్ గ్రామానికి చెందిన ధనసిరి తుకారాం (43) జాతర నిమిత్తం కూతురు వద్దకు వచ్చాడు. బుధవారం గుండంలో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదావశత్తు గుండంలో పడి పోయాడు. అతడికి ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగి చనిపోయాడు. మృతుడు వేసుకున్న బట్టలు గుండం బయట ఉండడంతో స్థానికులు గమనించి గుండంలోని నీళ్ల తొలగించి చూడగా వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించారు. మునిపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతి చెందిన వ్యక్తిని పోస్టుమార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ధనసిరి చిలకమ్మ ఫిర్యాదు మేరకుఎస్సై రాజేష్ నాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**పాపన్నపేట, నవంబరు 19, ప్రభాతవార్త :** ట్రాక్టర్ ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిగా పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. పోద్చన్‌పల్లి గ్రామానికి చెందిన పచ్చ దేవరాజ్(17) మరికొందరితో కలిసి క్యాటరింగ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరితో కలిసి ఆటోలో ఏడుపాయలకు వెళ్లాడు. అక్కడ క్యాటరింగ్ ముగించుకొని తిరిగి ఇంటికి ఆటోలో వస్తుండగా నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడగా దేవరాజ్‌తో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వారిని అంబులెన్సులో మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దేవరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

**కంగ్టి, నవంబరు 19 ప్రభాతవార్త :** మండలంలోని జంగికె గ్రామంలో పీడీఎస్ రైస్ అక్రమంగా నిల్వ చేశారని నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులతో కలసి జంగికె గ్రామంలో గైనీ రాములు ఇంట్లో సోదా చేయగా ఇంట్లో 50 కిలోలు కల్గిన 10 సంచులు మొత్తం 500 కిలోల పీడీఎస్ రైస్ దాచిపెట్టిన రేషన్ బియ్యాన్నిపట్టుకొని స్వాధీనం చేశారు. అయితే అతను గత కొంత కాలంగా స్థానిక కార్డు దారుల నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేసి, బయట ఎక్కువ ధరకు అమ్మేందుకు సిద్ధం చేసి ఉంచినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ దుర్గ రెడ్డి కేసు నమోదు చేసి, నిందితుడు అరెస్టు కోసం దర్యాప్తు కొనసాగుతోంది అని పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం



ఇరిగేషన్ ఈఈకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## యాసంగికి నీళ్లు ఇవ్వండి..ఇరిగేషన్ ఈఈకి వినతి

**చిన్నకోడూరు, నవంబరు 19, ప్రభాతవార్త:** రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి ఈ యాసంగి పంట సాగుకు గోదావరి జలాలు అందించాలని మండల పరిధిలోని గోనెపల్లి గ్రామస్తులు బుధవారం ఇరిగేషన్ ఈఈ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు కమలాకర్‌చారి మాట్లాడుతూ రంగనాయకసాగర్ రిజర్వాయర్ కుడి కాలువ నుంచి పిల్ల కాలువ తవ్వించి గోనెపల్లికి నీళ్లు అందించాలన్నారు. రిజర్వాయర్ ఉన్నప్పటికీ మా గ్రామానికి చుక్క నీళ్లు రావడం లేదన్నారు. ప్రతి యాసంగిలో చివరి రెండు తడులు నీళ్లు లేక వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి నీటి వసతి లేక పంటలు సాగు చేయడం కష్టతరంగా ఉందన్నారు. అధికారులు స్పందించి గోదావరి నీళ్లు గ్రామానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## కాంగ్రెస్ పాలనలో ఆలయ అభివృద్ధి శూన్యం

### పాలకమండలి లేకుండా జాతర నిర్వహణ



మాట్లాడుతున్న సత్తిరెడ్డి

**కొమురవెల్లి, నవంబరు 19, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధి కుంటుపడిందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో మల్లన్న ఆలయ అభివృద్ధిని పట్టించుకునే నాథుడేలేడన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి నిధులు తేవడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. దేవాలయ పాలక మండలి ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పాలన ఆలయ భూములన్ని అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, బాలకిషన్, తాడూరి మల్లేశం బాలస్వామి, నీల భిక్షపతి పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి



ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**గజ్వేల్, నవంబరు 19(ప్రభాతవార్త):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల మహిళా జూనియర్ కళాశాలలో స్త్రీ శక్తి దివస్‌పై సెమినార్ నిర్వహించి ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఏబివిపి సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్య హాజరై మాట్లాడుతూ దేశంలో చెట్లను, ఆవులనే కాదు ఈ దేశంలో ప్రవహించే నదులను సైతం కొలిచే దేశం మనది అని అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి తన ఆఖరి శ్వాస వరకు దేశ హితం కోసం నడుస్తూ తన శవాన్ని కూడా బ్రిటిషర్లు తాకడానికి వీలులేదని తనకి తానే అగ్నికి ఆహుతి అవుతూ కూడా భారత మాతాకీ జై అని గర్జించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేందర్, నగర కార్యదర్శి గురు, మహిళా కన్వీనర్ రాధిక, కళాశాల కార్యదర్శి అభిచరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో...**

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 19, ప్రభాతవార్త :** అమ్మాయిలు రుద్రమ దేవిలా ఎదిగితే అణచివేతకు ఎక్కడా చోటు ఉండదని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్త్రీశక్తి దివస్ సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅధితిగా ప్రిన్సిపాల్ లలిత హాజరై మాట్లాడుతూ భారత వీరనారి, అసమాన ధైర్యసాహసాల ప్రతీక రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జీవి తం, ఆమె నాయకత్వం, త్యాగం, మాతృభూమి పట్ల ఉన్న అపార భక్తిని స్మరించుకున్నారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంసాని రాకేష్ మాట్లా డుతూ భారతదేశం ఎందరో వీరులను, వీరమాతలను ప్రసవించిన పవిత్ర భూమి అని, ఆ గౌరవనీయులలో రాణి ఝాన్సీలక్ష్మీబాయి అత్యున్నత స్థానంలో నిలిచిన వీరనారి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చరణ్, కళాశాల కార్యదర్శి అభినయ శ్రీ, నగర సంయుక్త కార్యదర్శి అంజిలతో పాటు తదితరులు ఉన్నారు.

## దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా కార్యదర్శిగా బండి నరేష్



బండి నరేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం

**గజ్వేల్, నవంబరు 19 (ప్రభాతవార్త):** దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సిద్దిపేట జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శిగా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన జర్నలిస్టు బండి నరేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం, యువజన విద్యార్థి విభాగం రాష్ట్ర ఇంచార్జ్ వనం రమేష్, రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరిలు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండి నరేష్ మాట్లాడుతూ దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. దళితుల అభివృద్ధి కోసం పాటుపడతానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## భగవంతుని సేవకు మించిన సేవ మరొకటి లేదు : ఎసిపి

**గజ్వేల్ టౌన్, నవంబరు 19 (ప్రభాతవార్త):** భగవంతుని సేవకు మించిన భాగ్యం మరొకటి లేదని ఎన్నో భగవంతుని చిత్రాలు భక్తితో చిత్రించిన గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు కార్తీకమాసం సందర్భంగా ఐదు రూపాయల నాణాలతో రూపొందించిన శివలింగం చిత్రాన్ని బుధవారం గజ్వేల్ ఏసిపి నరసింహులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసిపి నరసింహులు మాట్లాడుతూ అపర రామదాసుగా గుర్తింపబడ్డ గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి రామరాజు నిరంతరం రాముని సేవలో తరిస్తూ రామకోటి వ్రాస్తూ లక్షల మంది భక్తులచే వ్రాయిస్తున్న రామరాజు ఆధ్యాత్మిక కృషి, పట్టుదల గొప్పదన్నారు. ఐదు రూపాయల నాణాలతో అత్యంత అద్భుతంగా శివలింగం, త్రిశూలం చిత్రాన్ని అద్భుతంగా చిత్రించడం చాలా గొప్ప విషయమన్నారు.



డిసిసి బిసి సెల్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



గజ్వేల్‌లో..



కొత్తపల్లిలో...



నర్సాపూర్‌లో...

# మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళులు



సిద్దిపేటలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్/నంగునూర్/కొమురవెల్లి, నవంబరు 19, ప్రభాతవార్త :** దేశ అభ్యున్నతికి పాటుపడిన ఉక్కు మహిళ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కెడం లింగమూర్తి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు ఎం.డి. ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తాలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ, ఎల్లం యాదవ్, బొమ్మల యాదగిరి, సాకి అనంద్, కలీం, మధు, సంతోషి, గయాజుద్దీన్, వహబ్, అజ్మాత్, బాలయ్య, సీతాబాలు తదితరులు పాల్గొన్నారు.

**డిసిసి బిసిసెల్ ఆధ్వర్యంలో...**

డిసిసి బిసిసెల్ అధ్యక్షులు డాక్టర్ లక్కరసు సూర్య చంద్రవర్మ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. అనంతరం ఆమె దేశానికి, పేదలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, మంద పాండు, మిద్దె ప్రసాద్, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో....**

మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు దేవులపల్లి యాదగిరి, చెలికాని యాదగిరి, నాగరాజు, సంపత్, శ్రీనివాస్, బాలయ్య, వెంకట్ రెడ్డి, కృష్ణ, కనకయ్య, విక్రమ్‌రెడ్డి, శ్రీకాంత్, సురేష్, రాజు, శ్రీకాంత్, సాంబయ్య, రాజు, పర్శరాములు, మహేందర్, రామకిష్టయ్య, పాషా పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో...**

భారతరత్న, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలను డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

**గజ్వేల్, నవంబరు 19 (ప్రభాతవార్త):** ఇందిరాగాంధీ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మహిళగా గుర్తింపు పొందారని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. బుధవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరాపార్కు వద్ద, ప్రజ్ఞాపూర్‌లో ఇందిరా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ కుటుంబం లేకుండా దేశానికి స్వాతంత్ర్యం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, సుఖేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజార్, కుంట్ల లక్ష్మారెడ్డి, తంజుముల్ మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, కన్నాయాదవ్, గాడిపల్లి శ్రీను, రేగొండ, జహీర్, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, నాచారం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు శివులు, జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు మన్నె అరుణ్, అజీం, పెర్క నాగరాజు, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపల్లిలో...**

**గుమ్మడిదల నవంబరు 19 ప్రభాతవార్త :** గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో భారతరత్న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళ ప్రధానిగా ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి కోసం ఆహోర్నిశలు శ్రమించారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చాకలి చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ విజయ్‌కుమార్, పార్టీ యూత్ అధ్యక్షులు లింగయ్యగారి హనుమంత్‌రెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు గాలి మల్లేశం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆగం రాజు నీరుడి నర్సింలు అభిమానులు నీరుడి నాగేష్, నీరుడి మల్లేశం, నీరుడి కృష్ణ, మన్నె ఆంజనేయులు, కొక్కొండ నవీన్, పార్టీ జనరల్ సెక్రెటరీ కొక్కొండ సురేష్ కొక్కొండ అశోక్ పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, నవంబరు 19 , ప్రభాతవార్త :** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల మల్లేశం, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్‌నాయక్ మాజీ ఎంపీటీసీ అశోక్, కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌యాదవ్, నాయకులు కుమ్మరి నాగేశ్, కాగజ్‌మద్దూర్ మాజీ సర్పంచ్ శివకుమార్, రసన్, అజ్మత్ మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు

# పత్తి కొనుగోళ్లలో ఆంక్షలను ఎత్తివేయాలి

### ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



కాటన్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, నవంబరు 19 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో రైతులు పంటలు పండించేందుకు సరైన సమయంలో ఎరువులు, యూరియా దొరకక అధిక వర్షాలతో పంటలు పండక రైతులు సతమతమవుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిసిఐ పత్తి కొనుగోళ్లలో మ్యాచర్ కారణంగా, ఆన్‌లైన్‌యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు సవాలక్ష ఆంక్షలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గజ్వేల్‌లోని పిడిచెడ్ రోడ్డులోగల సాయి బాలాజీ కాటన్ మిల్లులో రైతులతో కలిసి పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరైందికాదన్నారు. రైతుల దగ్గర స్మార్ట్ ఫోన్‌లు ఉండవని, రిజిస్ట్రేషన్లు, స్లాట్ రైతులు ఎలా బుకింగ్ చేసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిసిఐ కొనుగోలు కేంద్రాల ద్వారా ఒక ఎకరానికి 7క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయడం చాలా దారుణమని, గతంలో కెసిఆర్ ప్రభుత్వ హయాంలో సిసిఐ ద్వారా మద్దతు ధర కల్పిస్తూ ఆంక్షలు లేకుండా సుమారు ఒక ఎకరానికి 13 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ రైతువద్దఉన్న ధాన్యం, పత్తిని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయడంలేదని, రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణమవుతుందన్నారు. గత 20 సంవత్సరాలుగా గజ్వేల్ మార్కెట్ యార్డులో అన్ని రకాల పంటలు, సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చేశారని, నేడు కాంగ్రెస్ అసమర్థ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో గజ్వేల్ మార్కెట్‌యార్డును మూసివేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. వారం రోజులుగా మూసివేసిన గజ్వేల్ మార్కెట్ యార్డును ప్రారంభించకపోతే వేలాది మంది రైతులతో కలిసి మార్కెట్ యార్డు ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. రైతులు పండించిన పత్తి పంటలను ఆంక్షలు లేకుండా పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బెండె మధు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు విరాసత్‌అలీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జకియొద్దీన్, దయాకర్‌రెడ్డి, అశోక్, ఉప్పల మెట్టయ్య, దుర్గాప్రసాద్, మర్కంటి కనకయ్య, మల్లేశం, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, బొగ్గుల చందు, అహ్మద్, రజనికాంత్, లక్ష్మణ్‌రావు, భాస్కర్, దయానంద్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, ప్రవీణ్, పర్వేజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ పూలమాలవేసి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

## ఇందిరాగాంధీ చిరస్మరణీయురాలు : నాయిని యాదగిరి

**గజ్వేల్ టౌన్, నవంబరు 19 (ప్రభాతవార్త):** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిరస్మరణీయురాలు అని టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం గజ్వేల్‌లో ఇందిరాగాంధీ ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో నిరుపేదల సంక్షేమానికి ఎనలేని సేవలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ గోపాల్‌రావు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు భవాని తిరుపతి, సయ్యద్ బాబా, మామిడి కృష్ణ, శాతం స్వామి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె కృపానందం, మాజీ కో-ఆప్షన్ మెంబర్ గంగిశెట్టి రాజు, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాలింగారి రాజుగౌడ్, మాజీ ఎంపిటిసి పంజాల రాజుగౌడ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు మిందె నరేష్, నాయకులు టిల్లురెడ్డి, వేణుగోపాల్, నాయిని శ్రీనివాస్, ప్రభాకర్‌గౌడ్, రవి, మామిడి మహేష్, జమీర్, రాజు, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక పోటీలలో సత్తాచాటిన విద్యార్థినులు

**వర్గల్, నవంబరు 19 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా యువజన శాఖ, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు, సైన్స్ మేళ-2025 మంగళవారం నిర్వహించగా ఈ పోటీలలో వర్గల్ మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీలలో జానపద నృత్యం, జానపద పాట, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, పోయెట్రీ, సైన్స్ మేళా విభాగంలో ఇన్నోవేషన్ ఇన్ అప్రోచ్, క్వాలిటీ ఆఫ్ ప్రెసెంటేషన్, ఇంపాక్ట్ మొదలగు అంశాలపై పోటీలు నిర్వహించగా ఎంజెపి విద్యార్థులు 57 మంది పాల్గొన్నారు. పెయింటింగ్ పోటీలో ఎంఎస్‌సిఎస్ డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని బి.కావ్య ద్వితీయ స్థానంలో, బృంద గానం పోటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థినిలు ఎం.భవాని బిబిసి,ఎం.జ్యోతి ఎంపిసి, జి.అనూష ఎంపిసిఎస్ ద్వితీయ స్థానంలో, పోయెట్రీ రైటింగ్‌లో ఎస్.శృతి ఎంఎస్‌సిఎస్ తృతీయ స్థానంలో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు డాక్టర్ గడ్డం భాస్కర్‌రావు, ఉప ప్రధానాచార్యులు పి.గోవిందరావు, ఎటిపి వర్జిని దేదీప్య, డిడబ్ల్యూ జయలక్ష్మి, పిడి లోకేశ్వరి, స్నేహ, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

## సెయింట్ మేరీస్ పాఠశాలలో సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు సెలక్షన్స్

**గజ్వేల్, నవంబరు 19 (ప్రభాతవార్త):** ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యా నికేతన్ హైస్కూల్‌లో ఈనెల 22న సిద్దిపేట జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్ జరుగుతున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి కైలాసంగుప్త పేర్కొన్నారు. సెలక్షన్స్‌లో సిద్దిపేట జిల్లాకు చెందినవారే ఉండాలని, గతంలో రాష్ట్రస్థాయిలో సబ్ జూనియర్, జూనియర్ పాల్గొన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన క్రీడాకారులు ఆధార్‌కార్డు, విద్యా అర్హత సర్టిఫికెట్‌తో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం వెంకటేశ్వర్లు 7981923779 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్ట్




వివరాలను వెల్లడించిన తూప్రాన్ డిఎస్‌పి నరేందర్‌గౌడ్

**నర్సాపూర్, నవంబరు 19, ప్రభాతవార్త**

పట్టణంలోని రాయరావు చెరువు వద్ద మంగళవారం ఒక వ్యక్తినిహత్య చేసిన సంఘటనలో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు సంబంధించిన వివరాలను బుధవారం తూప్రాన్ డిఎస్పి నరేందర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన షారుఖ్ అన్సారి (22) నర్సాపూర్‌లో కార్ సర్వీసింగ్ సెంటర్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే షారుఖ్ అన్సారి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన సల్మా బేగంతో గత ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది ఈ దాంపత్య జీవితంలో వీరికి ముగ్గురు సంతానం. వీరు నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నారు సల్మా బేగం స్నేహితురాలు అప్ష బేగం సైతం నర్సాపూర్ లోనే నివాసం ఉంటున్నారు. ఈ మేరకు అప్షా బేగంకు జహీరాబాద్‌కు చెందిన షబ్బర్‌తో కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారు కూడా నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో షారుఖ్‌అన్సారి భార్య స్నేహితురాలు అప్షాబేగంతో సన్నితంగా ఉంటూ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలిపారు. అప్షా బేగం భర్త షబ్బర్ పలు కేసులలో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చాడన్నారు. భార్య షారుఖ్‌అన్సారితో అక్రమ సంబంధం పెట్టుకున్నట్టు అనుమానం కలిగింది. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల వారు తకచు గోడవ లు పడేవారనప్నారు. ఈక్రమంలో నర్సాపూర్‌లోని సల్మాబేగం చిన్నమ్మ ఇంటిలో ఇరు కుటుంబాలవారు కూర్చుని ఒకరి వద్దకు ఒకరు వెళ్ళొద్దని కలిసిమెలిసి ఉండాలని మాట్లాడుకున్నారు. మాట్లాడే సమయంలో మృతుడైన షారుక్ అన్సారి లేడని తెలిపారు. ఈ క్రమంలోనే షబ్బర్ తన భార్యతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడన్న కోపంతో ఎలాగైనా షారుఖ్ అన్సారిని చంపేయాలని నిర్ధారించుకొని సోమవారం రాత్రి మృతుడి భార్య సల్మా బేగంతో ఫోన్ చేయించి నర్సాపూర్ రాయరావు చెరువువద్దకు రావాలని షారుక్ అన్సారికి ఫోన్‌చేశారు. ఈ మేరకు షారుఖ్ అన్సారి రాయరావు చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలోనే షబ్బర్, రేష్మబేగం, అంబదాస్ అలియాస్ శివారెడ్డి, షబ్బీర్‌లు కలిసి షారుక్ అన్సారిపై దాడి చేసి కత్తులతో అతి దారుణంగా పొడిచి హత్య చేశారని తూప్రాన్ డిఎస్పి నరేందర్‌గౌడ్ వెల్లడించారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



గ్యాస్ పైప్‌లైన్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం

## నిరక్ష్యపు నీడలో గుత్తేదారు పనులు

### బొంతపల్లి టొరెంట్ గ్యాస్ పైప్‌లైన్ వద్ద తప్పిన భారీ ప్రమాదం

**గుమ్మడిదల నవంబరు 19 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి సైమడ్ పరిశ్రమ ప్రధాన గేట్ ఎదుట గుత్తేదారు ఇష్టారాజ్యంగా ముందస్తు అనుమతులు లేకుండా తవ్వక పనులు జరిపిన సంగతి స్థానికంగా కలకలం రేపుతోంది. దానికి ప్రధాన కారణం జెసిబి ద్వారా డ్రైనేజీ పనులు చేస్తుండగా భూమి లోపల ఉన్న టొరెంట్ గ్యాస్ హై ప్రెషర్ పైప్‌లైన్‌కు తగిలి గ్యాస్ లీకేజ్ జరిగింది. దీంతో ప్రజలు భయాందోళనలో పరుగులు తీశారు. గ్యాస్ పైప్ లైన్ కలదు అని హెచ్చరిక బోర్డు ఉన్నా ముందుగా సమాచారం లేకుండా తవ్వకూడదని నోటీసు బోర్డుపై స్పష్టంగా పేర్కొన్నా ఈ పనులను ఇష్టాలనుసారంగా ప్రజల భద్రతను లెక్కలోకి తీసుకోకుండా పనులను కొనసాగించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ ప్రాంతంలో కొద్ది దూరంలో భారీ కెమికల్ పరిశ్రమలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం సంభవించి ఉంటే సుమారుగా కిలోమీటర్ల మేర భారీగా ప్రాణ ఆస్తి నష్టం జరిగేది. ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం రోడ్డు రవాణా శాఖ ఏఈ ఎవరూ స్పందించకపోవడం వల్ల ప్రజలు ఆందోళనను అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా అనుకోని అగ్ని ప్రమాదం జరిగి ఉంటే భారీ సంఖ్యలో ప్రజల ప్రాణాలు పోయేవి కదా ఎలాంటి ప్రమాదం జరగలేదు కాబట్టి సరిపోయింది అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అటు పరిశ్రమ ఇటు రహదారిపై వెళ్లే ప్రజలు ఎవరికి ఏం జరిగినా గుత్తేదారు బాధ్యత తీసుకునే వాడా అని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి నిరక్ష్యపు పనులను చేపట్టిన గుత్తేదారును కఠినంగా శిక్షించాలని ప్రస్తుతం అధికారుల పర్య వేక్షణ లేకుండా పనులు సాగుతున్నాయా అని విచారించి బాధ్యులందరి పైన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## 21న ముదిరాజ్ జెండాను ఎగురవేయాలి

**కొండపాక, నవంబరు 19, ప్రభాతవార్త :** పల్లె పల్లెలో, గ్రామ గ్రామాన ఈనెల 21న ముదిరాజ్ జెండాను ఎగురవేసి అత్మ గౌరవాన్ని చాటుకుందామని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు జిర్ర రాజు కోరారు. బుధవారం వెలకట్ట క్రాస్ రోడ్డులో తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవం వేడుకలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల ఐక్యతను నిరుపించుకుందామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాతర్ల కొండల్, మిద్దె శివకుమార్, నీల సత్యం, కోల స్వామి, సుదర్శన్, ఉపేందర్, అంజనేయులు, శ్రీనివాస్, సున్నం బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ

**సిద్దిపేట అర్బన్, నవంబరు 19, ప్రభాతవార్త :** పట్టణంలోని వైశ్య భవన్ సమీపంలోని వివేకానంద కాలనీకి చెందిన చీకోటి పుణ్యవతి(82) బుధవారం మృతి చెందగా కుటుంబ సభ్యుల అనుమతితో వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. సేకరించిన నేత్రాలను గజ్వేల్ ఐ బ్యాంకు పంపించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ప్రతినిధులు గంప కృష్ణమూర్తి, చకిలం రవి, ఎం.కుమార్, తిమ్మిశెట్టి వీరేశం, కూర శ్రీనివాస్, భూమయ్య నగేష్, శ్రీనివాస్, ప్రసాద్, ఆర్వపల్లి కిరణ్ పాల్గొన్నారు. నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులకు క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 19, ప్రభాతవార్త**

ప్రజలు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ తాటి మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా కమిషనర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర ఉన్న పబ్లిక్ టాయిలెట్‌ను పర్యవేక్షి ంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు బహిరంగ మలమూత్ర విసర్జన చేయకూడదని, మరుగుదొడ్లను వాడుకోవాలని, బయటకు వచ్చినప్పుడు పబ్లిక్ టాయిలెట్ల ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ 3 సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరచుకోవాలని, పట్టణంలో ఎఫ్‌ఎస్‌టిపి (మల వ్యర్థ శుద్ధికరణ కేంద్రము) అందుబాటులో ఉందన్నారు. ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ పట్టణాన్ని స్వచ్ఛతలో ముందు ఉంచాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, శంకర్, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డ్ ఆఫీసర్లు, పబ్లిక్ టాయిలెట్ కేర్ టేకర్ రాజు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.




పబ్లిక్ టాయిలెట్‌లను పరిశీలిస్తున్న కమిషనర్


ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌ను సన్మానిస్తున్న బాదల్‌గావ్ గ్రామస్థులు

## ఎంపి సురేశ్‌శెట్కార్‌కు సన్మానం

**మనూర్, నవంబరు 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాదల్‌గావ్ గ్రామంలోగల శ్రీపంచలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన కార్తీక దీపోత్సవాలకు హాజరైన జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌ను గ్రామస్థులు, ఆలయ కమిటీ బాధ్యులు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించి మెమొంటోను అందించారు. ఆలయంలో ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజలు నిర్వహించారు.

## పంచలింగేశ్వర ఆలయంలో నగేష్‌కుమార్ పూజలు


పంచలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న నగేష్ శెట్కార్

**మనూర్, నవంబరు 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాదల్‌గావ్ గ్రామంలో కొలువున్న శ్రీపంచలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌కుమార్ శెట్కార్ కుటుంబ సభ్యులతోకలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌శెట్కార్, సాగర్‌శెట్కార్ పాల్గొన్నారు.

## రాఘవేంద్రనగర్ కాలనీలో హైమాస్ట్ లైట్ ప్రారంభం

**సదాశివపేట, నవంబరు 19 (ప్రభాతవార్త):** పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి, టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి సహకారంతో 22వ వార్డ్ రాఘవేంద్రనగర్‌లో హైమాస్ట్‌లైట్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, సునంద్‌రావు, ఆత్మ కమిటీ డైరెక్టర్, రాములుగౌడ్, ఈశ్వర మార్కండేయ మందిర చైర్మన్ వెంకన్నబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వసీం, బిట్ల ప్రేమ్ కుమార్ నగేష్, విశ్వనాథం, నరేష్ దేశ్ పాండే, చాకలి మల్లేశం, వీరేశం, చరణ్, సాయిలు, జంగయ్య, ముత్యాలు, మంగలి దర్శన్, రాములు, ఇబ్రహీం ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్‌లో స్వర్ణనిధి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


స్వర్ణనిధి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏజీఎం వెంకటేశం, సిబ్బంది

**న్యాల్‌కల్, నవంబరు 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంక్‌ను బుధవారం ఎజిఎం వెంకటేశం సందర్శించారు. ఈ సందర్భంగా స్వర్ణనిధి డిపాజిట్ పథకం వాల్‌పోస్టర్‌ను బ్యాంక్ సిబ్బందితో కలిసి ఆవిష్కరించి స్వర్ణనిధిపథకంలో డిపాజిట్ చేసుకుంటే కలిగే ప్రయోజనాలు, వడ్డీపై వివరించారు. స్వర్ణనిధిలో 444 రోజుల ఫిక్స్ డిపాజిట్ చేసుకుంటే 7.75 శాతం, సీనియర్ సిటిజన్‌లకు 8.25 వడ్డీని అందుకుంటారన్నారు. న్యాల్‌కల్ బ్యాంక్‌లో మొబైల్ బ్యాంకింగ్‌తో పాటు లాకర్ సదుపాయాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంఓల బ్రాంచ్ మేనేజర్ ధనుంజయ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి చేయూత అందించాలి

### కార్పొరేటర్ పుష్పనగేష్


డివిజన్ అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, నవంబరు 19 ప్రభాతవార్త :** రామచంద్రాపురం డివిజన్‌లోని ఆయా కాలనీల అభివృద్ధికి అధికారులు చేయూతనందజేయడం తోపాటు కాలనీవాసులు సహకారం అందచేయాలని కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న కార్పొరేటర్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు, కాలనీ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. డివిజన్‌లో శానిటేషన్ సమస్య, సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, గాంధీ బాలవిహార్ పార్క్, మయూరినగర్ థీమ్‌పార్క్, రిటైనింగ్ వాల్, కాంపౌండ్‌వాల్, హిందూ శ్మశానవాటిక, క్రిస్టియన్, మైనారిటీ అభివృద్ధి, ఓపెన్ డ్రైన్, స్ట్రోమ్‌వాటర్ డ్రైన్, రాయసముద్రం చెరువు అభివృద్ధి, స్ట్రీట్ లైట్స్, దోమల నివారణ, కరెంటు సమస్యలపై కార్పొరేటర్ అధికారులు, కాలనీల అధ్యక్షులతో సుదీర్ఘంగా చర్చించి కాలనీల అభివృద్ధికి పాలుపడాలన్నారు. డిసెంబర్ మాసం మొదటి వారంలో మేయర్, కమిషనర్, మంత్రులు, ఎంఎల్ఏలతో కలిసి చెరువు సుందరీకరణ, మల్లిపర్సస్ ఫంక్షన్ హాల్, మీట్ మార్కెట్, గాంధీ బాలవిహార్ పార్క్, కాకతీయ నగర్ పార్క్, మయూర్‌నగర్ పార్క్, సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ విజయమోహన్, ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, ఏఈ లిఖిత, జలమండలి డిజిఎం శివకృష్ణ, మేనేజర్ లోకేష్, ఏఈ తిరుపతయ్య, ఆయా కాలనీల అధ్యక్షులు రఘురాంరెడ్డి, వీర్‌శెట్టి, మాధవరెడ్డి, అమృత్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**సదాశివపేట, నవంబరు 19 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్‌పార్టీ నేత ప్రభాకర్ భార్య ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ మీకు అండగా ఉంటుందని, దిగులు చెందవద్దని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, యువత మండల అధ్యక్షుడు నరేష్ గౌడ్, ఏస్సీ సెల్ అధ్యక్షుడు బేగరి సుధాకర్, మాజీ ఎంపిటిసి రాములు, మాజీ సర్పంచులు బోయిని శ్రీనివాస్, రాదేశంపంతులు ఆంజయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు సామేల్, బాలరాజ్‌గౌడ్, మొగులయ్య, బుచ్చయ్య, రాజ మల్లయ్య తదితరులు ఉన్నారు.

# త్వరలో పిఎం నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు

### మెదక్ ఎంపి రఘునందన్‌రావు


హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించిన రఘునందన్‌రావు, వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తదితరులు

**కొడిపల్లి, నవంబరు 19, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి 'శ్రీ' పథకం ద్వారా మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద 2024-25లో మంజూరు చేసిన నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేయించి, బాధ్యులైనవారిపై చర్యలు తీసుకుంటానని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధర్మాసాగర్ గేట్ వద్దగల శ్రీహన్మాన్ ఆలయ కమిటీ పిలుపు మేరకు మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి ఎంపి హాజరై పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి పూర్వ విద్యార్థులు (2024-25) గతంలో ఫిర్యాదు చేయగా, ఈ రోజు తనను కలిసి పిఎంశ్రీ నిధులు గోల్‌మాల్ విషయంపై తన దృష్టికి తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశంలో చర్చించి, కలెక్టర్‌తో పాటు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసి దర్యాప్తు చేయిస్తానని ఆయన పూర్వ విద్యార్థులకు హామి ఇచ్చారు. కాగా శ్రీహన్మాన్ ఆలయ కమిటీ పిలుపు మేరకు మొదటి వార్షికోత్సవానికి విచ్చేసిన ఎంపి రఘునందన్‌రావు, బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఖాజిపేట రాజేందర్‌కు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సంధ్యగల్ల క్రిష్ణ, తిమ్మాపూర్ శ్రీహరి గౌడ్, శ్రీహన్మాన్ ఆలయ కమిటీ సభ్యులు మంగలి స్వామి, పుండరీకంగౌడ్, జీవన్‌గౌడ్ అయ్యప్ప, ప్రదీప్‌గౌడ్, తిమ్మాపూర్ శ్రీకాంత్‌గౌడ్, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

### ఎబివిపి రాష్ట్ర కో కన్వీనర్ బండారి ప్రశాంత్

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 19, ప్రభాతవార్త :** ఎబివిపి ఆధ్వర్యంలో సాయికృప కళాశాలలో ఘనంగా ఝాన్సీరాణి లక్ష్మీబాయ్ జయంతి నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కేల్ కో కన్వీనర్ బండారి ప్రశాంత్ మాట్లాడుతూ, ఝాన్సీరాణి లక్ష్మీబాయ్ బ్రిటిష్ పరిపాలనలో ప్రజలకు జరుగుతున్న అరాచకాలకు ఎదురు నిలిచి పోరాడిందని కొనియాడారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి అర్జున్, ఆదర్శ్, నవీన్, భరత్‌సింగ్ కార్యకర్తలు అరవింద్, భాను, భాస్కర్, దీక్షిత్, వినయ్, శ్రీఅలేఖ్య పాల్గొన్నారు.

## మొక్కలు నాటండి.. ప్రకృతిని కాపాడండి...


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

**పాపన్నపేట, నవంబర్ 19, ప్రభాతవార్త :** యూత్ అండ్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పాపన్నపేటలో ఉన్నత పాఠశాల విద్యార్థులు భూమిని కాపాడండి అంటూ పాపన్నపేట అంగట్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగడికి చుట్టుపక్కల మండలాల నుండి సుమారు 30 గ్రామాల ప్రజలు వస్తుంటారు, వీరికి విద్యార్థులు అంగట్లో తిరుగుతూ అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటండి ప్రకృతిని కాపాడండి జంతువులను సంరక్షించండి, విద్యుత్ ఆదా చేయండి, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించండి, నీటిని సంరక్షించండి, కాలుష్యాన్ని నివారించండి చెత్త కోసం బుట్టలను వాడండి అంటూ అంగట్లో తిరుగుతూ పాంప్లెట్లు పంచుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశం, అంజాగౌడ్, ప్రవీణ్, భట్టు నాగరాజు, యాదయ్య, నింగప్ప, మోహన్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, శ్రవణ్, రవికాంత్, కృష్ణకాంత్, రియాజ్, శ్రీహరి, విశ్వనాథ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు..

## సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**రామాయంపేట, నవంబరు 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం కృషిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రగతి ధర్మారం గ్రామ అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రగతి ధర్మారం పెద్ద చెరువులో మూడు రకాల చేప పిల్లలను వేసి అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి చేస్తుందని తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్విరామ కృషి చేస్తుందన్నారు. చెరువులో దాదాపు 176200 చేప పిల్లలు వేయడం జరిగింద న్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహేందర్ తో పాటు మత్స్య శాఖ సిబ్బంది భరత్ కుమార్, మహేష్, హాజీ పాషా, పెట్టేరి నాగరాజు, పిట్ల సిద్దయ్య, బద్రి, సిద్ధ రాములు, కృష్ణ, సుందరయ్య, నారాయణ, నరసయ్య తో పాటు గ్రామ పెద్దలు, చేపల సంఘం సభ్యులు, యూత్ లీడర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ప్రగతి ధర్మారం చెరువులోకి చేప పిల్లలను వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న ఆర్‌డివో మహిపాల్‌రెడ్డి

## ధాన్యాన్ని త్వరగా తరలించాలి : ఆర్డీవో

**చిలిపిచెడ్, నవంబరు 19 ప్రభాతవార్త :** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చిలిపిచేడ్ మండలంలోని శీలంపల్లి రైతువేదిక వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ..తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి, రైస్‌మిల్లుకు తరలించాలన్నారు. కొనుగోలు వివరాలను ఆనలైన్‌లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా చూడాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన టార్పాలిన, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. మిల్లుల వద్ద లారీలను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు దించుకొని, లోడింగ్ సమస్యలు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. గ్రేడ్ ఏ ధాన్యానికి రూ. 2,389, కాగా బి గ్రేడ్ కు రూ. 2369 మద్దతు ధర మీద కొనుగోలు చేయాలని సూచించారు. రైతులను డబ్బులు ఎవరూ అడిగినా ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల ఇబ్బందులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ సహదేవ్, ఆర్ఐ సునీల్ చౌహాన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.

## విద్యార్థి దశ నుంచే ఆద్యాత్మిక భావన అలవర్చుకోవాలి

**పాపన్నపేట, నవంబరు 19, ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుండి ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని డాక్టర్ గిరిధర్ తెలిపారు. బుధవారం మల్లంపేటలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతు దైవచింతన సన్మార్గాన్ని చూపుతుందన్నారు. వన భోజనాల వల్ల సమైక్యత, సమానత్వం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నర్సింహా రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, దేవదాస్, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

**నంగునూర్, నవంబరు 19, ప్రభాతవార్త :** పిల్లలు శ్రద్ధగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రింటర్ అందించారు. ఈసందర్భంగా హెచ్ఎం సింగాభట్టు రామరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచి పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. పేద పిల్లల చదువు కోసం సహాయం చేయడంలో తాను ముందుటానని వివరించారు. హెచ్ఎం మాట్లాడారు. కార్యక్రమంలో గోవిందారం రవి, ఉపాధ్యాయుల అనిల్ యాదవ్, బాబు, బాలకిషన్‌గౌడ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**సిద్దిపేట రూరల్, నవంబరు 19, ప్రభాతవార్త :** ప్రజా శ్రేయస్సు, ప్రజా ఆరోగ్యమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమని సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు చేయించుకోవడానికి సిఎంఆర్ఎఫ్ నిధి మేలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు పార్టీలకు అతీతంగా సిఎంఆర్ఎఫ్ చెక్కులను అర్హులైన ప్రతి నిరుపేదకు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), పార్టీ నాయకులు మీసం మహేందర్ యాదవ్, బిక్షపతి, అంజయ్య, అర్షద్, వాహబ్, రషద్, మహిపాల్‌రెడ్డి, ఎర్ర మహేందర్, శ్రీనివాస్, పద్మ, అజ్మాత్ తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వర మందిరంలో కార్తిక మాస పూజలు

**సదాశివపేట, నవంబరు 19 (ప్రభాతవార్త):** కార్తీక మాసం చివరి మాస శివరాత్రి సందర్భంగా బసవేశ్వర ఆలయంలో కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఎడ్ల బజార్ వీరశైవ సమాజం అధ్యక్షుడు గందిగే రాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల పర్యవేక్షణలో బసవేశ్వర దేవాలయం లోని బసవన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏ కార్యక్రమం అయినా మా ఎడ్ల బజార్ వీరసేవ సమాజం వారు అందరం ఒకే కుటుంబంల కలిసికట్టుగా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ కార్తీకమాసంలో మా ఆలయం నుండి పది కిలోమీటర్ల దూరంలోని తంగేడి పల్లి లో గల జంగమయ్య గుట్ట వరకు నడుచుకుంటూ వెళ్లి వన భోజన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. సమాజంలోని మహిళలు ప్రతి కార్యక్రమంలో ముందుండి వైభవంగా నిర్వహిస్తారని ప్రతినెల మాస శివరాత్రి రోజున మహిళలంతా కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అన్నారు. అనంతరం మంగళహారతి తీర్థ ప్రసాద వితరణ గావించారు.


జిహెచ్ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న సింధుఆదర్శ్‌రెడ్డి

## డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

### -కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, నవంబరు 19, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్‌ను బుధవారం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి, ఎంఐజి కాలనీల్లో 2 కోట్లతో సిసిరోడ్ల నిర్మాణం, అన్నమయ్య ఎన్‌క్లేవ్‌లో సెంట్రల్ మీడియన్ నిర్మాణం, మాక్ సొసైటీ, ఎంఐఇ అన్నమయ్య కాలనీల్లో 1 కోటి రూపాయలతో పార్క్ అభివృద్ధి, ఎల్ఐజి, మాక్ సొసైటీలో 1 కోటి రూపాయలతో నీటి డ్రైయిన్ నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు కమిషనర్‌కు అందచేశామన్నారు. కమిషన్ కర్ణన్ నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారని కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి వివరించారు. భారతీ నగర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని, డివిజన్ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందచేస్తున్నామని కార్పొరేటర్ పేర్కొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘననివాళులు


మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**జహీరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని బుధవారం జహీరాబాద్ పట్టణంలోని జాతీయ రహదారి పైగల ఆమె విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి దేశానికి అందచేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, మండల అధ్యక్షుడు పి నరసింహారెడ్డి, నాయకులు, మాజీ కౌన్సిలర్లు, హుగ్గెల్లి ఎంజి రాములుయాదవ్, రాములు నేత, ఎండి ఖాజామియా, మోతిరామ్, ఎండి యూనిస్, జాంగిర్, ఖండెం సుజాత, పుణ్యమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, జయరాజ్, మల్లికార్జున్, శేఖర్ పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో...**


ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**నారాయణఖేడ్, నవంబరు 19 ప్రభాతవార్త :** పట్టణ పరిధిలోని జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ స్వగ్రామంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్‌షెట్కార్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేష్ షెట్కార్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ భారత రాజకీయాలలో అపూర్వమైన నాయకత్వం కనబరిచారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జోగిపేటలో...**



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**జోగిపేట, నవంబరు 19, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని బుధవారంం జోగిపేటలో ఘనంగా నిర్వహించారు. జోగిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఆమె చేసిన సేవలు ఎనలేవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.శివరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, మాజీ కౌన్సిలర్ సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, శరత్‌బాబు, పిట్ల లక్ష్మణ్, నాయకులు డి.వెంకటేశం, కె.రాజశేఖర్, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భక్తితోనే మానవ జీవితానికి ముక్తి

### -మాల్‌రాజ్ ఆశ్రమ పీఠాధిపతి మల్లికార్జున్ అప్పాజీ

**మనూర్, నవంబరు 19, ప్రభాతవార్త:** భక్తితోనే మానవ జీవితానికి ముక్తి దక్కుతుందని కర్ణాటకలోని మాల్‌రాజా ఆశ్రమపీఠాధిపతి మల్లికార్జున అప్పాజీ అన్నారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని బాదల్‌గావ్‌లో కొలువున్న శ్రీ పంచలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం, మాస శివరాత్రి ఉత్సవ పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లికార్జున అప్పాజీని భక్తులు పటాకులు కాలుస్తూ ఘనంగా స్వాగతం పలుకగా ఆలయంలో పూజలు నిర్వహించి ప్రవచనాలు వినిపించారు. ప్రతి వ్యక్తి క్రమశిక్షణతో మసులుకుంటే భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందన్నారు. ఆలయ ఆవరణలో మల్లికార్జున అప్పాజీకి గ్రామస్థులు, ఆలయ కమిటీ బాధ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించి మెమొంటోను అందచేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

## ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

**పాపన్నపేట, నవంబరు 19, ప్రభాతవార్త :** ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు వస్తాయని హార్టికల్చర్ జిల్లా మేనేజర్ వీవీ కిషన్ తెలిపారు. సహకార వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు కేవలం వరినే నమ్ముకోకుండా, వాణిజ్య వంటల వైపు దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్, సంగమేష్, రామాగౌడ్, సంతోష్ కుమార్, జాన్సన్, డైరక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హార్టికల్చర్ జిల్లా మేనేజర్ వీవీ కిషన్

# గీత కార్మికులను నిరక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవీందర్ గౌడ్


మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

**అక్కన్నపేట, నవంబరు 19, ప్రభాతవార్త**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కల్లుగీత కార్మికులను నిర్లక్ష్యం చేస్తుందని కల్లుగీతా కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ మండిపడ్డారు. బుధవారం మండలంలోని జనగామ గ్రామంలో కల్లుగీత కార్మికుల సమస్యల గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కల్లు గీత కార్మికులు తాటి చెట్టుపై నుంచి పడి చనిపోయిన, వికలాంగులైనవారికి పరిహారం అందడం లేదన్నారు. గీతా కార్మికులలో అర్హులైన వారికి కొత్త పెన్షన్‌లు కూడా మంజూరు చేయడం లేదని, ఇప్పటివరకు పాత పెన్షన్లు పెంచలేదని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బెల్ట్‌షాపులు తొలగిస్తామని హామీ ఇవ్వడంతోపాటు కల్లుగీత కార్మిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 100 కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకిరాగానే విస్మరించారని మండిపడ్డారు. బలహీన వర్గాల శాఖకు మంత్రిగా ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ గీతా కార్మికుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి వహించడం బాధాకరమైన విషయమన్నారు. గీత కార్మికుల ప్రధాన సమస్యలపై ఈనెల 28వ తేదీ సూర్యాపేటలో భారీ బహిరంగ సభ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ మండల గీతా కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బిక్షపతి, పెద్దన్న, కనుకయ్య, రవిందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.